


20న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

ప్రజాశక్తి -తిరుమల: శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా 20న దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి నాడు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటు చేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారు. ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం స్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఈసందర్భంగా టిటిడి కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

నారావారిపల్లిలో నారా కుటుంబం

- తమ్ముని ప్రథమ వర్ధంతికి చంద్రబాబు హాజరు
- నారా రామ్మూర్తి స్మృతివనం వద్ద నివాళి



ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లిలో ఒక్కరోజు పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం కుటుంబంతో సహా విచ్చేశారు. ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభంబన్సల్, కమిషనర్ మౌర్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎంఎల్‌ఎలు సాదర స్వాగతం పలికారు. నారావారిపల్లిలోని సొంత ఇంట్లో నారా రామ్మూర్తి సంవత్సరీక కార్యక్రమం సందర్భంగా తమ్ముని కొడుకు, హీరో నారా రోహిత్‌తో పూజలు చేయించారు. నారా రామ్మూర్తి స్మృతివనంవద్ద నివాళి అర్పించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, కుటుంబీకులతో కలిసి భోజనం చేశారు. అర్జీలను స్వీకరించారు. అనంతరం రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచే చంద్రబాబు, నారా లోకేష్ బయల్దేరి విజయవాడకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్, మురళీమోహన్,ఆదిమూలం, తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, చుడ ఛైర్మన్ హేమలత, శాప్ ఛైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సి.ఆర్.రాజన్, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ఉన్నారు.



డిసిఎంఎస్ ఛైర్మన్‌కు నివాళి

ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ నారావారిపల్లి స్వగ్రామం నుంచి ఉదయం 7.26 గంటలకు బయల్దేరి రోడ్డుమార్గాన పనపాకం వరకూ ప్రజలకు అభివాదం చేస్తూ డిసిఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు స్వగ్రామం గడ్డంవారిపల్లికి చేరుకున్నారు. పల్లినేని సుబ్రమణ్యం నాయుడు చిత్రపటానికి మంత్రి నారా లోకేష్, ఎంఎల్‌ఎ పులివర్తి నాని పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నాగరికత పూర్తిగా అభివృద్ధి చెందని నాటి నుంచి సమాజ అభివృద్ధిలో మహర్షి వాల్మీకి రచనలు ప్రముఖ పాత్ర పోషించిందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆదికవి వాల్మీకి జయంతి ఉత్సవాలలో భాగంగా జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణం వంటి అద్భుత కావ్యాన్ని రచించారని, తన రచనలతో సమాజంలో అసమానతలను తొలగించే ప్రయత్నం చేశారన్నారు. కుప్పం నియోజకవర్గంలో వాల్మీకి భవనం నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరలో పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. నరేగా, నాబార్డ్ నిధుల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి వంటి వెనుకబడిన వర్గాలకు చెందిన కాలనీలలో మౌలిక వసతుల కల్పన, అభ్యున్నతికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించడానికి చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, బిసి నాయకులు షణ్ముగం, అట్లూరి శ్రీనివాసులు, బిసి వెల్ఫేర్ ఆఫీసు రబ్బానీ బాష పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిడిపి అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, రామ్మూర్తి, రవిరెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు: పట్టణంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఆ సంఘ నేతలు కల్వకుంట్ల సుకుమార్ బాబు, హోమియో వైద్యునిపుణులు డాక్టర్ శివ స్థానిక ఇందిరా సర్కిల్లో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుకుమార్ బాబు ఆధ్వర్యంలో బసవరాజ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వాలీబాల్, నెట్ క్రీడా సామగ్రి అందించడంతోపాటు అన్నదానం చేశారు. సివిరెడ్డి, మాధవరెడ్డి, గిరి, ఏఎంసీ ఛైర్మన్ సమీపతి యాదవ్, అర్బన్ సిఐ సుబ్బరాయుడు, అద్దాల నాగరాజు, రెడ్డప్ప, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సోమల (సదుం): మండల కేంద్రమైన సదుం వాల్మీకి వీధిలోని వాల్మీకి ఆలయంలో వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించి జయంతి వేడుకలను వాల్మీకి కులస్తులు ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు చిన్న రమణ, పవన్, రవి, మునిరత్నం, మునికృష్ణ, రాఘవ, ఈశ్వర, మంజునాథ్ అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గస్థాయి వాల్మీకి సంఘం నాయకులు గంగరాజు లక్ష్మన్నలను ఘనంగా సన్మానించారు.

కుప్పం: కుప్పం వాల్మీకి భవన్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిగత్నం పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, కడ వాడివైసర్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్ దాము, సురేష్ పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలం మాధవరం పంచాయతీ ఎం.బోయిపల్లి గ్రామంలో వాల్మీకులు వాల్మీకి మహర్షి జయంతి వేడుకగా జరుపుకున్నారు. టి.నారాయణ, టి.కోదండ, పిటి.మంజునాథ్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



పుంగనూరులో..



రామకుప్పంలో..

సూపర్ జీఎస్టీ పై విస్తృత ప్రచారం

ప్రజలకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలలో భాగంగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలపై మాసాంతపు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రముఖ కూడళ్ల వద్ద, మండల స్థాయిలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్లు స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని, పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ట్రాక్టర్, ర్యాలీల ద్వారా గ్రామాలలో, మండలాలలో రైతులకు అవగాహన కల్పించాలని, పరిశ్రమలు, చేనేత శాఖలు వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. రాబోయే కాలంలో ప్రజలు ఎక్కడ కూడా నీటికి ఇబ్బంది పడకూడదని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో తిరిగి తాగునీటి సమస్యను గుర్తించి వాటిని పరిష్కరించి దిశగా కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు పంచాయతీ సెక్రటరీపై ఆధారపడకుండా క్షేత్రస్థాయిలో తిరగాలని, అలాగే నీటి పైపులైన్లు పరిశీలించి పగిలిన పైపులను మరమ్మతులు చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల భారిన పడకుండా జిల్లా వైద్యశాఖ, మున్సిపాలిటీ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 9వ తేదీన వైద్యఆరోగ్యశాఖలోని డిఎంహెచ్ఓ, డిసిహెచ్‌ఎస్, మెడికల్ కాలేజీలు, ఏహెచ్, సిహెచ్‌సి, పిహెచ్‌సి, విహెచ్‌సిల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కల్పించాలని మంగళవారం వైద్య అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా వైద్యాధికారిని డాక్టర్ సుధారాణి తెలిపారు.

ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



కార్వేటినగరం: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. మంగళవారం కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామి ఆర్చి నుండి గాండ్ల మిట్ట కూడలి వరకు రైతులు టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ను నడిపారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు రైతులకు ఎంతో మేలు కలిగిందని తమ ప్రభుత్వం ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ప్రజలకు అర్థమయ్యేలా ఫ్లెక్ కార్డులో ప్రదర్శించి తగ్గిన జీఎస్టీ గురించి వివరించారు. ఎమ్మెల్యేను సింగల్ విండో అధ్యక్షులు జనార్ధన్ రాజు, జిల్లా సాధికారిక సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, ఎమ్మెల్యే సోదరులు వి.రాజా, మోహన్ మురళి వెదురుకుప్పం ఎంపీడీవో చంద్రమౌళి, జీఎస్టీ నోడల్ అధికారి సురేష్ కుమార్ శాలువాలు కప్పి సన్మానించారు.

పలమనేరు: పట్టణంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్‌లో విద్యారంగం, స్టేషనరీ వస్తువులపై పన్ను ఉపశమనం గురించి ఎంఈవో పి.లీలారాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఓ వినోద, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీ హరిప్రసాద్, మున్సిపల్ స్టాఫ్ పాకృద్దీన్, మున్సిపల్ ఇంచార్జ్ సురేష్ పాల్గొన్నారు.

యాదమరి: జీఎస్టీ 2.0లో సూపర్‌సేవింగ్స్ ఉండడం సంతోషంగా ఉందని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ ఎపి.లలిత అన్నారు. విద్యారంగంలోని స్టేషనరీ వస్తువులపై భారీగా పన్ను ఉపశమనం గురించి మండల విద్యాశాఖ అధికారి హెచ్.ఎల్.ఎన్.ప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యాసరచన, వకృత్త పోటీల్లో గెలుపొందని విద్యార్థులకు బహుమతులు అందించారు. పంచాయితీ సెక్రటరీ శైలజ, వెల్ఫర్ అస్టిటెంట్ కవిత, ఉపాధ్యాయులు కనకాచారి, భాస్కర్‌రెడ్డి, మధుసూధన్, దామోధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సోమల: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు వస్తువులపై జిఎస్టి తగ్గించి ప్రజలకు అధిక ధరల నుండి ఉపశమనం కలిగించిన నేపథ్యంలో జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని ఎంపీడీవో జివిఎస్‌వి.ప్రసాద్ కోరారు. పొదలకుంటపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి అనంతరం ఎస్ డబ్ల్యూ పిసి చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపిటీసీ నాగభూషణ రెడ్డి, కార్యదర్శి ఫయాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ రాజకీయ పునాది కుట్రలే

మీడియాతో ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు


చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గం దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి అక్కడి సర్పంచి గోవిందయ్య ఉద్దేశపూర్వకంగానే నిప్పంటించినట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యిందని, సర్పంచి గోవిందయ్య వెనుక ఉండి ఈ ఘోర తప్పిదాన్ని చేయించిన వారిని విడిచిపెట్టబోమని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ థామస్, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి రెండు అడుగుల దూరంలోనే వైయస్సార్ విగ్రహం కూడా ఉందని, ఈ రెండు విగ్రహాలకు దూరంగా ఉన్న ఓ చిన్న పూరిపాకకు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిప్పంటుకుంటే ఆ పూరిపాక దుకాణ నిర్వాహకురాలు సులోచనమ్మ సర్పంచి గోవిందయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన ఆ నిప్పులను అంబేద్కర్ విగ్రహానికి మళ్ళించి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వైసిపి ఈ ఘటనను వాడుకుంటూ తెలుగుదేశం పార్టీకి ఈ మచ్చ తేవాలని కుట్ర చేశారన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో సర్పంచి గోవిందయ్యే అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని తేల్చారన్నారు. ఇప్పుడు ఈ కుట్ర తతంగం బయటపడడంతో వైసిపి నీచ రాజకీయాలు ప్రజలకు తెలిసాయన్నారు. గోవిందయ్య అరెస్టు తర్వాత వైసిపి నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని, గోవిందయ్య వెనుక ఎంతటి వారు ఉన్నా సరే చట్టం ముందు తలవంచక తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశం జరుగుతుండగా జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామిని పత్రికల్లో రాయలేని విధంగా ఉండే పదజాలంతో మాట్లాడటంతో ఒక్కసారిగా మీడియా అవాక్కు అయ్యేలా చేసింది. సమావేశంలో చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్ పాల్గొన్నారు.

సంఘమిత్రలను బెదిరిస్తున్న
ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలి

యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం సంఘమిత్రలు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్లైన్ వర్క్ నిలిపివేసి పోరాటం చేస్తుంటే చిత్తూరు జిల్లాలో బలవంతంగా సంఘం మిత్రులను ఏపీఎంలు, సీసీలు బెదిరిస్తూ ఇబ్బందులు పెట్టడం దారుణమని, బెదిరింపులు వెంటనే మానుకోవాలని ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, శ్రీధర్ బాబులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష్యం నెరవేరడానికి పని బాగా జరగడానికి ఫైవ్ జి సిమ్ములు ఇచ్చి కొత్త ఫోన్లు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం వాడుతున్న ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా సంఘమిత్రలు ఆన్లైన్ వరకు నిలిపివేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఆన్లైన్ వర్క్ నిలిచిపోయిందని, కానీ చిత్తూరు జిల్లాలో మాత్రం అధికారులు సంఘమిత్రలు బెదిరిస్తూ పని చేయించడం దారుణమన్నారు. జిల్లాలో ఏపీఎంలు, సీసీలు సహకారంతో కొంతమంది సంఘమిత్రలు అక్రమాలకు పాల్పడుతుంటే అధికారులు మాత్రం కేవలం సంఘమిత్రలపైన మాత్రమే చర్యలు తీసుకోవడం, ఏపిఎం, సీసీలను వెనకేసుకుని రావడం జరుగుతున్నదని ఇందులో రాజకీయ జోక్యం కూడా తీవ్రమవుతోందని, రాజకీయ వేధింపులు వెంటనే మానుకోవాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంఘమిత్ర సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఆ సమస్యను పరిష్కారం చేయకపోవడం సరైన కాదన్నారు. వెంటనే సంఘమిత్రలకు 5జి సిమ్ములు కొత్త ఫోన్లు ఇచ్చి హెచ్ఆర్ పాలసీ అమలు చేసి వేతనాలు పెంచి సంఘమిత్రల అకౌంట్‌కి వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎస్వీ జూ పార్కులో జాగ్వార్ కుశ మృత్యువాత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 2019లో హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ నుండి శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు తీసుకువచ్చిన జాగ్వార్ కుశ మంగళవారం ప్రమాదవశాత్తు మరణించినట్లు జూక్యూరేటర్ సెల్వం ఓ ప్రకటనలో తెలిపారు. జాగ్వార్ కుశ వయసు 15 సంవత్సరాల మూడు నెలలు దాటిన కుశను ఎప్పటిలాగే ఆవరణలోకి విడిచి పెట్టారు. ప్రమాదవశాత్తు ఒక చెట్టుకు చిక్కుకుపోయి చనిపోయి కనిపించిందన్నారు. ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజీ విభాగం పాథాలజిస్టులు పోస్టుమార్టం నిర్వహించి, కుశ పోస్టుమార్టం నివేదికలో మరణానికి కారణం హైపర్ వాల్మీక్ షాక్, ఆస్పిజియా అని నిర్ధారించారన్నారు. అనంతరం జాగ్వార్ కుశ మృతదేహాన్ని ఖననం చేశారు.

పరిశ్రమలకు భూమిలిచ్చే రైతులను ఆదుకుంటాం..

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని మణింద్రం పంచాయతీలో పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇస్తున్న రైతులను అన్నివిధాల ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, కడ పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంచాయతీలో ఇప్పటికే 367 ఎకరాలు రెండుసార్లు మినీ హెయిర్ స్ట్రిప్ నిర్మాణానికి భూములు అందించమన్నారు. ఇప్పుడు ఆరు వందల ఎకరాల భూములు పరిశ్రమల ఏర్పాటుకు ఇస్తే ఎకరా, రెండు ఎకరాలు ఉన్న రైతులు తమ జీవనోపాధి కోల్పోతామంటూ, ససేమిరా భూముల ఇవ్వమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. దీంతో రెండు వందల ఎకరాల భూములు ఇవ్వాలని నేతలు రైతులను కోరారు. మూడు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్చించి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, ఆర్డీవో శ్రీనివాసరాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, ఏఎంసీ ఛైర్మన్ రాజు, మండల అధ్యక్షులు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో పాత అంబులెన్స్‌ల స్థానంలో కొత్త అంబులెన్స్‌లు తీసుకువచ్చి ప్రజలకు అత్యవసర సేవలు అందించడం జరుగుతున్నదని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం ప్రాంగణంలో కొత్త అంబులెన్స్‌ను కలెక్టర్, డిసిహెచ్‌ఎస్‌లు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆసుపత్రికి సంబంధించి పాత బడిన అంబులెన్స్‌ల స్థానంలో కొత్త అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఐఓసిఎల్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాంసబిలిటీ కింద త్వరలో మరొక అంబులెన్స్ రానున్నదని, దీనితో అంబులెన్స్‌ల సంఖ్య 4కు పెరుగుతుందన్నారు. అత్యవసర వైద్య చికిత్స, రెఫరల్‌ల కొరకు వేలూరు, తిరుపతిలోని ఆసుపత్రులకు రోగులను సరైన సమయంలో తీసుకువెళ్లాడానికి అంబులెన్స్‌లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్‌ఎస్ పద్మాంజలి, మెడికల్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ ఉషా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీయూష్ మిట్టల్, సిజిఎం (ఆపరేషన్స్) సూరజ్ కుమార్ పట్నాయక్, జిఎం (ఎల్‌జిపి) సతీష్ వెర్నేకర్ పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

గుండె మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్

63 ఏళ్ల రోగికి కొత్త జీవితం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గుండె వైఫల్యంతో పోరాడుతున్న మదనపల్లికి చెందిన 63 ఏళ్ల రోగికి గుండె శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు హెచ్‌ఒడి అండ్ లీడ్ కన్సల్టెంట్ డిపార్టుమెంట్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ నవీన్‌చంద్ర చెప్పారు. ఒకప్పుడు చురుకుగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తీవ్రమైన గుండెపోటుతో గుండెను తీవ్రంగా దెబ్బతీసింది. గుండె వైఫల్య దశలతో ఆస్పత్రిలో చేరిన అతనికి నిరంతర ఐవి ఇనోట్రోపిక్ థెరపీ (మిల్రినోన్) అవసరం అయ్యింది. అయినప్పటికీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. గుండె మార్పిడి లేకుండా అతను ఒక సంవత్సరానికి మించి జీవించే అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. గుండె మార్పిడి కోసం వేచి ఉన్న జాబితాలో ఉండగా మదనపల్లి స్వస్థలానికి చెందిన సరిపోయే దాత గుండె అందుబాటులోకి వచ్చింది. దీంతో కొత్త హృదయాన్ని విజయవంతంగా అమర్చారు. దాత, గ్రహీత ఇద్దరూ ఒకే పట్టణానికి చెందినవారు కావడంతో కోల్డ్ ఇస్కీమియా సమయం గణనీయంగా తగ్గి, శస్త్ర చికిత్స విజయానికి అనుకూలంగా మారింది.

సీజేఐపై దాడిని
న్యాయవ్యవస్థపై దాడిగానే పరిగణించాలి

వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ న్యాయవిభాగ కార్యదర్శి ఏజీ బాబు

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : భారత దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గవాయ్ మీద జరిగిన దాడిని యావత్తు న్యాయవ్యవస్థ మీద జరిగిన దాడిగానే పరిగణించాలని వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ న్యాయవిభాగ కార్యదర్శి ఏజీ బాబు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 2014న అధికారం చేపట్టిన నాటి నుంచి దేశంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మీద వరుసదాడులు, హత్యలు, అత్యాచారాలు, బరితెగింపు చర్యలు చేపడుతున్నారన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం ఏమీ తెలియనట్టు చేతులు దులుపుకోవడం హాస్యస్పదమన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీతో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి మీద జరిగిన దాడిని ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కును కోల్పోయారని విమర్శించారు. స్వాతంత్ర భారత దేశంలో గానీ, అంతకుముందు గానీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి మీద ఇలాంటి దాడి జరగలేదన్నారు. సనాతన ధర్మం పేరుతో దాడి జరగడం బాధాకరమన్నారు. ప్రధాన న్యాయమూర్తికి కూడా కులాన్ని అంటగట్టి దళితులు ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వారిపై వివక్ష ఆగలేదని మరోసారి బీజేపీ ప్రభుత్వం రుజువు చేసిందన్నారు. దాడి చేసిన దుండగునిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు దేశద్రోహం చట్టం కింద కూడా కేసు నమోదు చేసి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంటలపై ఏనుగుల గుంపు దాడి



వరి పంటను తిని తొక్కిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి- రొంపిచర్ల

పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ గ్రామాలలో మంగళవారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. దేవళంపేటకు చెందిన రైతులు గురుస్వామి, నారాయణ రైతులకు చెందిన వరి పంట, వేరుశనగ పంట, మామిడి, కొబ్బరి చెట్లను తొక్కి, విరిచి ధ్వంసం చేశాయి. పొలాలకు కంచెగా నిర్మించుకున్న రాతి కూసాలను విరిచేశాయి. దేవళంపేటకు సరిహద్దులో ఉన్న అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు దేవళంపేటకు చేరుకుని పంటలను ధ్వంసం చేసి మళ్లీ అడవుల్లోకి వెళ్లిపోయాయి.

పాల డెయిరీల సిండికేట్

- అందని గిట్టుబాటు ధర
- పశువుల పెంపకమే రైతులకు ఆధారం
- స్పందించని పాల డెయిరీల యాజమాన్యం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పాల డెయిరీల సిండికేట్ కారణంగా పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. పశువుల పెంపకంపై ఆధారపడిన రైతులకు చాలీచాలని ఆదాయంతో జీవనం ముందుకు సాగడంలేదు. పాల డెయిరీ యాజమాన్యం సైతం పాలను తక్కువ ధర చెల్లించి కొనుగోలుచేసి అధిక ధరలకు విక్రయిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తూ తమ పరిస్థితిని పట్టించుకోవడంలేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాల డెయిరీల సిండికేట్

గంగవరం మండలంలో గతంలో ఎక్కువగా పట్టుపురుగుల పెంపకంపై ఆధారపడి ప్రతి ఇంటిలోనూ పట్టు పురుగుల పెంపకం చేస్తూ జీవనం సాగించేవారు. గతంలో గిట్టుబాటు ధర లేక పోవడంతో పట్టుపురుగుల పెంపకం పై నిరాశ చెంది వాటికి దూరమైన రైతులు పశువుల పెంపకంపై ఆధారపడ్డారు. ఇంటింటికీ పాడి పశువులను పోషిస్తూ వాటి నుండి పాలు సేకరించి డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. గంగవరం మండలంలో 16 పంచాయతీలు, 125 గ్రామాలు ఉన్నాయి. గంగవరం మండలంలో హెరిటేజ్, తిరుమల, దొడ్ల, సంగం, డెయిరీ ఫార్మ్ గెట్ శ్రీనివాస, బాలాజీ డెయిరీ, పరాగ్ డెయిరీతో పాటు చిన్న చిన్న పాల శీతలకరణ కేంద్రాలు సైతం వున్నాయి. ఈ సేవల్లో రైతులు పశువుల పెంపకం పై ఆధార పడి డెయిరీలకు పాలు సరఫరా చేస్తున్నారు. ఒక గంగవరం మండలం లో రోజుకు ఎనిమిది లక్షల నుండి 10 లక్షల లీటర్ల పాలు డెయిరీలకు సరఫరా అవుతున్నట్లు సమాచారం. డెయిరీ యాజమాన్యం దీన్ని ఆసరాగా తీసుకొని అందరూ సిండికేట్ అయి పాలు ధరలు లీటరుకు రూ.25 నుండి రూ.35 లోపే రేటు ఖరారు చేసి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. రైతు వద్ద ఈ ధరకు కొనుక్కొని అదే డెయిరీలో పాకెట్ పాలు ధరలు 70 రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వీటితో పాటు పెరుగు, నెయ్యి, వెన్న లాంటి స్వీట్లు తయారుచేసి మార్కెట్లో అన్ని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే రైతుకు మాత్రం అందులో సగ భాగం కూడా ఇవ్వడం లేదు. దీంతో పాడి రైతులు తమ పరిస్థితిని పట్టించుకోవడం లేదని డెయిరీల యాజమాన్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అందని గిట్టుబాటు ధర

ఒక్కో పశువును లక్ష రూపాయలు వ్యయంతో పది ఆవులును కొనుగోలు చేసిన రైతుకు ఒక్కో రోజుకు వాటికి పశుగ్రాసం, పిండి, దాణా, తదితర ఖర్చులు రోజుకు మూడు వేలు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పది పశువులు వున్న రైతులు రోజూ పాలు 80 నుండి వంద లీటర్ల వరకు పాలు పోస్తున్నామని రైతులు వాపోతున్నారు. లీటరు 35 రూపాయలు చొప్పున 15 రోజులకు 30 నుంచి 35 వేల రూపాయలు వరకు వస్తోంద న్నారు. రోజూ ఉదయం 40 లీటర్లు, సాయంత్రం 40 లీటర్లు చొప్పున ఈ పాలు పోస్తున్నామన్నారు. రోజూ ఖర్చు 3 వేల రూపాయలు చొప్పున 15 రోజులకు 40 వేల రూపాయలు అవుతోందని పాడి రైతులు తెలిపారు. కష్టానికి తగిన ప్రతిఫలం రావడంలేదని దీన్ని వదిలివేయా లనుకుంటు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏమీ మిగలడంలేదు..



నేను గతంలో వ్యవసాయం తో పాటు పట్టు పురుగుల పెంపకం చేసేవాడిని.. అందులో ఏమీ మిగలక పోవడంతో ఆవులు ఒక్కొక్కటి లక్ష రూపాయలు చొప్పున ప్రస్తుతం పది ఆవులు కొనుక్కున్నాను..వాటిలో కొన్ని మాత్రమే పాలు ఇస్తున్నాయి. రోజూ వీటికి గ్రాసం పిండి, దాణా, పశుగ్రాసం మొత్తం కలిపి మూడు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నా..రోజుకు 80 లీటర్ల నుండి వంద లీటర్ల పాలు అమ్ముతున్నాను. ప్రస్తుతం లీటరు 35 రూపాయలు ఇస్తున్నారు. రోజూ వచ్చే డబ్బులు పశువుల పోషణ, పాలు పిండే వారికి ఇచ్చే కూలీలకే సరిపోతోంది. ఇక మిగిలేది ఏమీ లేదు..మా కష్టం అంతా పాల డెయిరీల వాళ్లకు దక్కుతోంది..

– జగన్నాథం, పాడి రైతు,

మిషన్లు ఇప్పించాలి



పాలు పితికే మిషన్లు, చాఫ్ కట్టర్ లాంటివి సబ్సిడీపై ఇప్పించాలి..గతంలో ఇవి ఇప్పించే వారు. ఇప్పుడు అలాంటివి ఏమీ లేవు.. వీటి కోసం తప్పని సరిగా ఇద్దరు మనుషులు కష్టపడాలి. డెయిరీల వాళ్లు పాలు రేట్లు పెంచాలని నిలదీస్తే ఏ డెయిరీలో ఎక్కువ రేటు ఇస్తే అక్కడే పోసుకోండి..' అంటున్నారు. విధిలేని పరిస్థితి లో మా కష్టాన్ని డెయిరీ వాళ్లకి ధారపోస్తున్నాం. నాలుగు పాడి ఆవులు వున్నాయి. మూడు పాలు ఇస్తున్నాయి..ఈ పాలు అమ్మకమే జీవనాధారం..గతంలో ఒక లీటరుకు ఏడాదికి ఒక రూపాయి బోనస్ ఇచ్చేవారు. పాల రేట్లు రోజుకు ఒక్కో రకంగా వున్నాయి..లీటరుకు 25 నుంచి 35 రూపాయలు ధర పలుకుతోంది. పశువుల పోషణ వేల రూపాయలు అవుతోంది. ఒక ఆవును కొనాలన్నా లక్ష రూపాయలు పై మాటే అవు తోంది..ఒక ఆవు 4,5 నెలల వరకే పాలు ఇస్తున్నాయి. ఆ తర్వాత నలిపేస్తున్నాయి.. ఈ ఐదు నెలల్లో లక్ష రూపాయలు ఎలా సంపాదించాలి? ఆ తర్వాత ఏడు నెలలు పోషించాలి.. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు..ఫ్యాక్టరీల వారు గిట్టుబాటు ధర కల్పించాలి..

- రత్నమ్మ, పాడిరైతు.

క్రైం న్యూస్

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చిత్తూరు టూ టౌన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు స్థానిక తోటపాలెంలో వుంటున్న వెంకటేష్ (38) సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తన రెండవ భార్య సంతపేటలో నివాసం ఉంటున్న మునియమ్మ వద్దకు వెళ్లాడని, పాఠశాల నుండి పిల్లలను తీసుకు వచ్చేందుకు వెళుతున్నానని మునియమ్మ చెప్పి వెంకటేష్‌ను ఇంటి వద్దే ఉండాలని కోరింది. పిల్లల్ని తీసుకొని ఇంటికి తిరిగి వచ్చే సమయానికి వెంకటేష్ ఉరివేసుకొని పడి ఉన్నట్లు మునియమ్మ బంధువులకు సమాచారం అందించింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా గుర్తించి టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని సామగుట్టు పల్లి వద్ద మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో కుప్పం మండలం నూలుకుంట కు చెందిన వెంకటేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో ద్విచక్ర వాహనం (బుల్లెట్ ను) చోరీకి గురైందని యజమాని ఆనంద్ మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి గ్రామంలోని పలు వీధుల్లో సంచరించారని గ్రామంలోని సీసీ కెమెరాల్లో వారి సంచారం నమోదైవుందని దీన్ని పరిశీలించి చోరీ అయిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కెనుమాకులపల్లి పంచాయతీకి అవార్డు

ప్రజాశక్తి -శాంతిపురం: మండలంలోని కెనుమా కులపల్లి గ్రామ పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అవార్డు దక్కింది. సోమవారం ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సర్పంచ్ ఏ వి జయరాం, పంచాయతీ కార్యదర్శి ఎఎస్ స్వాతి అందుకున్నారు. ఇతర పంచాయతీ సర్పంచులు కెనుమాకులపల్లి ఆదర్శంగా తీసుకోవాలని సూచించినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏ వి జయరాం మాట్లాడుతూ సి ఎం చేతుల మీదగా అవార్డు అందుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ స్ఫూర్తితో మరింత అభివృద్ధికి పాటు పడతానన్నారు.. పంచాయతీలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కొరత లేకుండా ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో పంచాయతీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయడమే ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర లో , పంచాయతీ సెక్రెటరీ ఎ ఎస్ స్వాతి, పంచాయతీ సర్పంచ్ ఏ వి జయరాం పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

68 గోకులం షెడ్లు మంజూరు

పశుసంవర్థక శాఖ ఏడీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: 168 గోకులం షెడ్లు మంజూరైనట్లు పశు వర్ధక శాఖ ఏడీ ఆసిఫ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ ఏపీఓ దినకర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం గోకుల షెడ్లను మంజూరు చేస్తోందని, ఒక్కొక్క షెడ్డు కు రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. మండలంలో 168 మందికి దరఖాస్తు చేసుకున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రాయితీతో నిర్మాణాలు చేపట్టేందుకు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హేమచంద్ర నాయుడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పురుషోత్తం , పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి -బంగారుపాలెం: బంగారుపాలెం మండలం సంక్రాంతి పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జ్యోతీశ్వర్ అనారోగ్య సమస్యలతో మంగళవారం మృతి చెందాడు. మృత దేహాన్ని పలువురు ప్రజా ప్రతినిధి సందర్శించి నివాళులర్పించారు . కుటుంబ సభ్యులను ఓదార్చారు

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును ఇన్‌ఛార్జి ఎంపీడీవో వినోద, మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, సి బాలసుందరం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్ర భోజనం వడ్డించాలని సూచించారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు వున్నా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో కలిసి కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల పలమనేరు పట్టణ ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్ద చెల్లారగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు పరిస్థితిని మంగళవారం ఎంపీడీవో చంద్రశేఖర రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో సంభాషించి భోజనం నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న ఇతర సౌకర్యాలపై కూడా ఎంక్వైరీ చేసి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, అక్కడి రికార్డులను పరిశీలించారు. పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు కోరారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, పంచాయతీ కార్యదర్శి గణేష్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ సురేష్ బాబు, ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిడిపిఆర్‌సి హరిప్రసాద్

ప్రతి ఇంట్లో చెత్త సేకరణ చేయాలి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గ్రామాల్లో ప్రతి ఇంట్లో చెత్తను సేకరించాలని డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ అధికారులకు, మహిళా సంఘాలకు మంగళవారం అవగాహన నిర్వహించారు. డిపిఆర్‌సి కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో మనోహర్ గౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు క్లీన్ చేయించాలని, తాగునీటి పైప్ లైన్లు లీకేజీలను అరికట్టాలన్నారు. గ్రామాల్లో మురికి నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని సూచించారు. గ్రామాల్లో అక్కడక్కడ చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో లోకేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర దినోత్సవ పరేడ్ ఎన్‌సీసీ ఎంపిక అధికారిగా కార్తీక్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రతి సంవత్సరం ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కి ఎన్‌సిసి విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసి పంపేందుకు చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ కార్తీక్ రాష్ట్ర స్థాయి సెలెక్షన్ కమిటీకి ఎన్నికయ్యారు. వారు సికింద్రాబాద్‌లో అక్టోబర్ 8 వ తేదీ నుండి 17 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రీ ఆర్‌డిసి క్యాంపు లో డ్రిల్ వ్యక్తిత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్యావరణ పరిరక్షణ, చురుకుదనం, మొదలగు అన్ని అంశాలలో శిక్షణ తదుపరి ఎంపిక చేసే బృందంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా నుండి ఎంపిక అయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హసన్ బాషా, ఉపాధ్యాయ బృందం ఆయనకు అభినందనలు తెలిపారు.

రహదారిపై హంద్రీ- నీవా నీరు

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



రహదారిపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎంపిడివో చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పెద్ద చల్లారగుంట గ్రామానికి వెళ్లే రహదారిపై హంద్రీ–నీవా ప్రాజెక్టు జలాలు ప్రవహించడం గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా, మంగళవారం స్థానికంగా ఎంపీడీవో పి చంద్రశేఖర రెడ్డి స్వయంగా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పెద్ద చల్లారగుంట చెరువు నిండి నీరు గ్రామ రహదారిలో ప్రవహిస్తూ పెద్దపురం చెరువుకు చేరు కుంటుండడంతో, గ్రామస్తులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్పందించిన చంద్రశేఖర్ రెడ్డి ఎంపీడీవో, జలాలు రహదారి మీదుగా కాకుండా వేరే మార్గంగా మళ్లించే దిశగా ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అజయ్, పంచాయతీ కార్యదర్శి గణేష్, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ సురేష్ బాబు, గ్రామస్తులు జయచంద్ర ప్రకాష్, గంగాధర్ రెడ్డి, హేమగిరి రెడ్డి పాల్గొన్నారు. గ్రామ ప్రజలు రహదారి పునరుద్ధరణతో పాటు, ఇలాంటి సమస్యలు మళ్లీ పనరావృతం కాకూడదని కోరుతున్నారు.

జిల్లా తైక్వాండో పోటీల్లో విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని జిల్లా క్రీడా ప్రాంగణంలో 69వ స్కూలు గేమ్స్ చిత్తూరు జిల్లా స్థాయి తైక్వాండో (14 సంవత్సరాల లోపు బాల బాలికల పోటీలు) మంగళవారం నిర్వహించారు. ఈ పోటీ ల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో స్వర్ణ పతకం సాధించి న వారు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత పొందుతారు. ఈ పోటీలను శ్రీ బాలాజీ డీఎస్‌డీవో డాక్టరు బాబు స్పోర్ట్స్ అథారిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శారద, స్పోర్ట్ అథారిటీ మహిళా కార్యదర్శి నిర్వహించారు. ప్రముఖ తైక్వాండ్ గ్రాండ్ మాస్టర్ బాబూరావును, అధికారులు చంద్ర శేఖర్ చిత్తూరు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, పోటీల నిర్వహణ కార్యవర్గ సభ్యులు, పలువురు క్రీడాకారులు సన్మానించి తైక్వాండో అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియా డారు. గ్రాండ్ మాస్టర్ బాబురావు మాట్లాడుతూ చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని క్రీడాకారులకు తైక్వాండో శిక్షణ ఇవ్వడానికి అందుబాటులో ఉండి తన వంతు ప్రత్యేక కృషి చేస్తానని, రాష్ట్ర స్థాయిలో తైక్వాండో క్రీడాకారుల నైపుణ్యత పెంచి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండలం, అరగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తవణంపల్లి మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, మాజీ అధ్యక్షులు ఆటో డ్రైవర్లు అందరికీ సక్రమంగా చేరాల్సిన మొత్తం అందిందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకట చౌదరి, మాజీ అధ్యక్షులు దిలీప్ , టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక సర్పంచి మల్లు దొరై, ప్రశాంత్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఎంబి ఉమాదేవి

ప్రజాశక్తి - కార్వేటినగరం : బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని జిల్లా సోషల్ వెల్ఫేర్ వర్కర్ ఎంబి ఉమా దేవి అన్నారు. మంగళ వారం కార్వేటి నగరం పంచాయతీ చింత తోపు ఎస్టి కాలనీ వాసులకు బాల్య వివాహల పై అవగాహన కల్పించారు. పి ఓ సి ఎస్ ఓ చట్టం గురించి వారికి వివరించారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాతే వివాహం చేయాలని తల్లిదండ్రులకు తెలిపారు. 18 సంవత్సరం నిండకుండా వివాహాలు చేశారని తమకు తెలిస్తే వారిపై కేసు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది , మహిళా పోలీసులు, అమృత సంత రమ్య, ఏఈ శశికుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత రక్త పరీక్షల శిబిరం

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని , నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ప్రభుత్వ ముందుకు సాగుతుందని అందులో భాగంగా రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం మంగళంపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసిడిఎస్ సూపరువైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహనతో ఉండాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శివశంకర్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక రుసుం వసూలు

- నిర్దేశిత రుసుం వసూలు చేయాలని ఆర్‌డివో ఆదేశం
- కైగల్ జలపాతం పర్యాటకులకు ఊరట

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: కైగల్ జలపాతం వద్ద పర్యాటకుల నుండి వాహనాలకు అధిక రుసుం వసూలు చేస్తు న్నారని ఆరోపణలు అందాయి. స్పందించిన ఆర్డీవో భవాని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా టూరిజం ఆఫీసర్ నరేంద్ర కుమార్, మేనేజర్ పి గౌరీలతో కలిసి నిర్వహించిన ఈ తనిఖీలో స్థానికుల నుంచి, పర్యాటకుల నుంచి అభిప్రాయా లు తీసుకున్నారు. ప్రస్తుతం కారుకు రూ.200, ద్విచక్ర వాహనాలకు రూ.50–100 వరకూ వసూలు చేస్తున్నట్టు వెల్లడైంది. పంచాయతీ అధికారుల ప్రకారం కేవలం రూ.50 (కారు) రూ.30 (టూ వీలర్)కు మాత్రమే వసూలు చేయాలని నిర్ణయం వుందని ఆర్డీవో స్పష్టం చేశారు. దీనిపై తహశీల్దారు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి, తీర్థం పంచాయతీ కార్యదర్శి సురేష్, సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ తదితరుల నుండి వివరాలు తీసుకున్నారు. గతంలో వేలంపాట ద్వారా వసూలు అయిన రూ.10 లక్షలలో పంచాయ తీకి కేవలం రూ.1 లక్ష మాత్రమే చెల్లించా రన్న సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంలో ఆర్డీవో భవాని మాట్లాడుతూ 'ప్రజలకు భారం కాకుండా సమర్థ వంతమైన వ్యవస్థ ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇకనుండి, నిర్దేశిత రుసుంకే చలానా వుండాలి..' అని అన్నారు. బోర్డులు ఏర్పాటు చేసి, వాహన రుసుం స్పష్టంగా తెలిపి వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం ఆఫీసర్ నరేంద్ర కుమా ర్, తహశీల్దారు ప్రసన్న కుమార్, మేనేజర్ పి గౌరీ, విఆర్‌ఓ గురురెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, సర్పంచ్ జ్యోతి శ్రీనివాసులు, పర్యాటకులు పాల్గొన్నారు.



అధిక రుసుం వసూలుపై పర్యాటకులను అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డివో

తప్పుడు కేసులు తొలగించండి

ఎస్‌పీకి టిడిపి వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: టిడిపి కార్యకర్తలపై 2019–2024 మధ్య నమోదైన తప్పుడు కేసులను తొలగించాలని కోరుతూ మంగళవారం టిడిపి నాయకులు సప్తగిరి ప్రసాద్, వెంకటేష్ యాదవ్, మోహన్ రాజ్, ధరణి ప్రకాష్ జిల్లా ఎస్‌పి తుషార్ దూడికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాప కింద నీరులా విస్తరించిన గంజాయి, లాటరీ టికెట్ల వ్యాపారాన్ని ఉక్కుపాదంతో తొక్కేయాలని , గంజాయి సరఫరాదారుల్ని, తమిళనాడు లాటరీని జిల్లా ఎల్లలు దాటి తరిమికొట్టాలని , అక్రమ వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ వ్యాపారులు, ఆటో ఫైనాన్స్ వ్యాపారులు చేస్తున్న దందాను పూర్తిగా నిషేధించాలని, అక్రమ వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకున్న సామాన్య మధ్యతరగతి కుటుంబం కాపాడాలని, కోరారు. ఖాళీగా ఉన్న హోంగార్డ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. జిల్లాలో డీజిల్ మాఫియా, కల్తీ మద్యం మాఫియాపై నిఘా పెంచి, పూర్తిగా అరికట్టి, వైసిపి నాయకులు చేస్తున్న అక్రమ ఇసుక, మైనింగ్ వ్యాపారంపై ఉక్కు పాదం మోపాలని కోరినట్లు తెలిపారు.

తాగునీటి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -ఐరాల: గ్రామాలలో తాగునీటి శుభ్రత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు ఐరాల ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేఫ్ డ్రింకింగ్ వాటర్ ప్రక్రియను ప్రజలకు వివరించాలని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో గర్భవతుల రిజిస్ట్రేషన్ ను పెంచాలని రిజిస్ట్రేషన్ ఆవశ్యకతను వివరిం చారు. అర్లీ రిజిస్ట్రేషన్ వల్ల హైరిస్క్ ఐడెంటిఫికేషన్ ను, ఫాలోఅప్‌ను చేయవచ్చున్నారు. స్పేసింగ్ మెథడ్స్ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సిడిపిఓ నిర్మల విచ్చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓను సన్మానించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, వైద్య రంగం కలిసి కృషి చేస్తే ప్రజల సంక్షేమం మరింత మెరుగై సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డెంటల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సిహెచ్ ఓ ఆదిలక్ష్మి , సూపరువైజరు చిన్నమ్మ , మేల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం , అంగన్‌వాడీ సూపరువైజరు మంజుల, ఎంఎల్‌హెచ్‌పి లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఐరాల ఆసుపత్రి వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐరాల ఆస్పత్రి వైద్యాధికారి

పాత బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- పలమనేరు: పెన్షనర్లకు 12వ పిఆర్సీ మరియు ఐ ఆర్ ప్రకటించి పెన్షనర్ల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ సంఘం నాయకులు డిమాండు చేశారు. చిత్తూరు జిల్లా పలమనేరు పెన్షన్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు గురుమూర్తి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు 16 నెలల కాలం కావస్తున్నా పూర్వ పంథాలోనే నడుస్తోందని ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ సంఘం కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం డిమాండు



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

స్వచ్ఛ కార్యాలయంగా ' కడ'

సీఎం చేతుల మీదుగా కడ పీడీకి అవార్డు

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం స్వచ్ఛ కార్యాలయంగా రాష్ట్రస్థాయి అవార్డు అందు కుంది. స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న కడ పీడీ వికాస్ మర్మత్‌ను సీఎం చంద్రబాబు అభినందిస్తూ రాష్ట్రస్థాయి అవార్డును అందించారు. కడ పిడి గా వికాస్ మర్మత్ నియమితులైన తర్వాత కుప్పం ప్రాంత అభివృద్ధికి ఆయన అహర్నిశలు పనిచేస్తూ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశారు. కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రానికే అభివృద్ధిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషి చేస్తుండగా కడ పీడీ వికాస్ మర్మత్ సైతం కుప్పం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. మారుమూల గ్రామాల్లో సైతం పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు, కుప్పం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి, స్వచ్ఛ నియోజకవర్గంగా కుప్పంను తీర్చిదిద్దడంతో పాటు అనేక పరిశ్రమల కల్పనకు ఎప్పటికప్పుడు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తూ పాలనాపరమైన పనులను చకచకా చేస్తున్న కడ పిడి వికాస్ మర్మత్ ను సీఎం చంద్రబాబు ఇదివరకే పలుమార్లు అభినందించారు. రాష్ట్ర ఉత్తమ మున్సిపాలిటీగా కుప్పం మున్సిపాలిటీ ఎంపిక కాగా, ఉత్తమ పంచాయతీగా శాంతిపురం మండలం కెనమాకులపల్లి మేజర్ పంచాయతీ ఎంపికైంది. ఇటీవలే కుప్పం మండలం కంగుంది సర్పంచ్ కు ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఢిల్లీ నుండి పిలుపు వచ్చింది. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం కుప్పంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తోంది. కుప్పం ప్రాంత అభివృద్ధిలో సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న కడ పీడీ వికాస్ మర్మత్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం పట్ల కుప్పం ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న కడ పీడీ వికాస్ మర్మత్

ఉద్యాన రైతులకు తీపి కబురు!

పంటల రాయితీని రెట్టింపు చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): ఉద్యాన రైతులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రస్తుతం అమలు చేస్తున్న పంటల రాయితీ ప్రభుత్వం రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. చిత్తూరు జిల్లాలో 83 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు అవుతుండగా ప్రధానంగా మామిడి, టమోటా, పూలు, కూరగాయలు, పంటలు విస్తారంగా సాగు అవుతున్నాయి. ఉద్యాన పంటలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ విస్తరణ పథకాలను అమలు చేస్తుంది. లాభదాయకంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు, డ్రాగన్ ఫ్రూట్ సాగుకు భారీగా ప్రోత్సాహాలు ఇవ్వనంది. గతంలో హెక్టార్ కి 30,000 ఉన్న రాయితీని ప్రస్తుతం లక్ష అరవై వేల రూపాయలకు పెంచింది. దీంతో రైతులకు ఈసారి ఎంతో లాభదాయకంగా మారనుంది. మామిడి, జీడి మామిడి, జామ తదితర పంటల కు సైతం రాయితీలు భారీగా పెరిగింది.

తక్కువ భూమి ఉన్న రైతులకు ప్రోత్సాహకాలు

ప్రభుత్వం తక్కువ భూమి కలిగి ఉన్న సన్న చిన్నకారు రైతులకు అత్యధిక శాతం ప్రోత్సాహాలు అందిస్తోంది. సాధారణ రైతులు కూడా ఈ ప్రోత్సాహకాలకు అర్హులు. ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లోని ఉద్యాన వ్యవసాయ సహాయకులు, ఉద్యాన శాఖ అధికారుల సంప్రదిస్తే రైతు పథకాలు వివరిస్తారు. ఈ పథకాలు విద్యానియా రేఖ రైతుల సద్వినిగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

పంటల వారీగా రాయితీ వివరాలు

ప్రభుత్వం తక్కువ భూమి కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు అత్యధిక శాతం ప్రోత్సాహాలు అందిస్తోంది.. సాధారణ రైతులు కూడా ఈ ప్రోత్సాహకాలకు అర్హులు. ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లోని ఉద్యాన వ్యవసాయ సహాయకులు, ఉద్యాన శాఖ అధికారుల సంప్రదిస్తే రైతు పథకాలు వివరిస్తారు. ఈ పథకాలు విద్యానియా రేఖ రైతుల సద్వినిగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

పంటలవారీగా రాయితీ వివరాలు

పంట	తొలి ఏడాది	రెండవ
డ్రాగన్ ఫ్రూట్	1,62,000	1,08,000
డిష్ కల్చర్	42,000	28,000
సీ తాఫలం	18,000	12,000
జామ	48,000	32,000
సపోటా	12,000	8,000
జీడి మామిడి	18,000	12,000
కూరగాయలు	24, 000	
పూల మొక్కలు	2,00,00	
పసుపు	40000	